www.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 01 | సంచిక : 25 (కాంప్లిమెంటరీ కాపీ) | ఆదివారం | 05.05.2024

# ఇష్టమొచ్చినట్టు తోడేస్తున్నారు

## చీటకోడూరులో జోరుగా ఇసుక అక్రమ రవాణా

- చెక్ డ్యాం నుంచి తరలింపు..
- వాల్టా చట్టానికి తూట్లు..
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- ట్రాక్టర్ యూనియన్ రూపంలో ఇసుక, మట్టి మాఫియా దందా
- పట్టించుకోని సంబంధిత అధికారులు

(ఉప్పలంచి నరేందర్, మన చౌరాస్తా )

జనగామ మండలం చీటకోడూరు గ్రామం జిల్లా కేంద్రానికి కూతవేటు దూరం. చీటకోడూరు - యశ్వంతపురం వాగులో చెక్ డ్యాం నిర్మాణం చేపట్టారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఫేజ్ 1,2 చెక్ డ్యాంలు మూడు సంవత్సరాలు గడిచినా నిర్మాణం పూర్తి కావడం లేదు. వాగుపై చెక్డ్యాం నిర్మించి భూగర్భ జలాలు పెంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే దానికి విరుద్ధంగా కాంట్రాక్టర్, తాజా మాజీ గ్రామ సర్పంచ్, ట్రాక్టర్ యజమానులు కుమ్మక్కై ఇసుకను అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ఇదేమిటని ప్రశ్నించిన గ్రామస్తులపై దాడులకు పాల్పడ్డ సంఘటనలు ఉన్నాయి. చెక్ డ్యాం నుంచి ఎలాంటి ఇసుకను తరలించవద్దని నిబంధన ఉన్నా, అధికారుల నిర్లక్ష్యంతో ఇటాచీ సహాయంతో ఇసుకను తీసుకెళ్తున్నారు. రైతు పొలంలోకి అని చెబుతూ ఇటాచీలను బావుల వద్ద, కొత్త కాపు కాలనీ వద్ద పెద్ద ఎత్తున ఇసుకను డంపు చేసి రాత్రివేలల్లో జిల్లా కేంద్రంతో పాటు, చుట్టు ప్రక్కల గ్రామాలకు, ట్రాక్టర్లలో ఇసుక తరలించి ఒక్కో ట్రిప్పుకు రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు..

### భూగర్భ జలాలు అడుగంటినా...

చీటకోడూరు గ్రామంలో అక్రమ ఇసుక రవాణాతో భూగర్భజలాలు అడుగంటాయని, వాగు పరివాహక రైతుల బావులలో గతంలో ఒకసారి వాగు పారితే నాలుగు సంవత్సరాలు నీటికి కొరత ఉండేది కాదని రైతులు చెబుతున్నారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి చెక్ డ్యాంలు నిర్మిస్తే ఇప్పుడు అక్రమ ఇసుక రవాణాతో బావులు, బోర్లు ఎండిపోయి భూగర్భజలాలు అడుగంటి పంటలు ఎండిపోయి అప్పుల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెక్ డ్యాంలు నిర్మించినా ఫలితం లేదని, అక్రమ ఇసుక తరలిస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ట్రాక్టర్ యూనియన్ పేరుతో..

అక్రమ ఇసుక, మట్టి తరలింపునకు ట్రాక్టర్ యజమానులు కుమ్మక్కై యూనియన్ ఏర్పాటు చేసుకొని దానికి ఒక ప్రెసిడెంట్ ను ఎన్నుకొని గ్రామంలో అక్రమంగా ఇసుక, మట్టి వ్యాపారం చేస్తున్నారు. ఏ అధికారి అయినా మట్టి, ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటే యూనియన్ పేరుతో ముడుపులు ముట్టజెప్పి దర్జాగా వారి పని వారు చేసుకుంటున్నారు. గతంలో ట్రాక్టర్లలో అక్రమ ఇసుక రవాణా చేస్తుంటే పట్టుకున్న పోలీసులు జరిమానా కింద గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో నాలుగు సీసీ కెమెరాలు అందించారు. అదే సాకుతో ఇప్పుడు ఏ అధికారి అక్రమ ఇసుక రవాణాతో పట్టు పడ్డ ట్రాక్టర్ల పై కేసులు కాకుండా ముడుపులు అందాయి, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం అని చెప్పుకొని బయటపడుతున్నారు. వారు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఏ ఒక్కటి గ్రామంలో పని చేయడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వారం రోజుల

క్రితం అక్రమ ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు పోలీసులకు పట్టుబడితే ట్రాక్టర్ యూనియన్ పేరుతో వెల్లి పది పేపర్ బండిల్స్ అందించి కేసు కాకుండా ట్రాక్టర్లను విడిపించుకున్నారని, కేసులు నమోదు చేసి అక్రమ ఇసుకను అరికట్టాల్సిన పోలీసులు ఇలా వదిలిపెట్టడమేంటని గ్రామంలో చర్చనీయాంశమయింది. అక్రమ ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు ఏ ఒక్కటీ కమర్షియల్ ట్రాక్టర్లు కావు, అగ్రికల్చర్ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకొని అక్రమ దందా కొనసాగిస్తున్నా అధికారులు పట్టించుకోక పోవడం గమనార్హం.

ఎలక్షన్ డ్యూటీలో అలర్ట్‌గా ఉండాలి 3

- ఎన్నికల వ్యయ పరిశీలకుడు సయాన్

నేరస్తులకు కోర్టులో శిక్ష పడేలా చూడాలి 2

- వరంగల్ సీపీ కిశోర్ ఝా

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి 3

- స్వీప్ నోడల్ అధికారి వినోద్ కుమార్

General News

# నేరస్తులకు కోర్టులో శిక్ష పడాలి

**వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

**వరంగల్, మన చౌరాస్తా :** నేరస్తులకు కోర్టులో శిక్షపడే విధంగా పోలీస్ అధికారులు విధులు నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ పోలీస్ అధికారులకు సూచించారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో వివిధ నేరాల్లో నేరస్తులకు కోర్టులో యావజ్జీవ కారాగార శిక్ష విధించడంలో విశేష కృషి చేసిన పబ్లిక్ ప్రాసీక్యూటర్లు, దర్యాప్తు అధికారులు, కోర్టు విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందికి వరంగల్ పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ కోర్టు విధులు నిర్వహించే పోలీస్ అధికారులు కోర్టు, బాధితులు, పోలీసులకు వారధిగా నిలుస్తూ శిక్షల శాతం ఘననీయంగా పెంచాల్సిన బాధ్యత పోలీస్ సిబ్బందిపై ఉందన్నారు. నేరం చేస్తే తప్పక శిక్ష పడుతుందనే భయాన్ని నేరస్తులకు కలిగించాలని, ముఖ్యంగా నేరస్తులకు కోర్టులో శిక్షపడటం ద్వారా బాధితులకు కొద్ది వరకు స్వాంతన చేకూరడంతో పాటు పోలీసులపై నమ్మకం, గౌరవం పెరుగుతుందన్నారు. మహిళలు, చిన్నారులపై దాడులకు పాల్పడిన నేరస్తులకు తప్పక శిక్ష పడేందుకుగా కోర్టు డ్యూటీ పోలీస్ అధికారులు, దర్యాప్తు పోలీస్ అధికారులు తీవ్రంగా కృషి చేయాలని, గ్రేవ్ కేసుల్లో నేరస్తులకు వంద శాతం శిక్ష పడేందుకు అధికారులు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని, రానున్న రోజుల్లో మరింత ప్రతిభ కనబరిచి నేరస్తులకు శిక్ష పడటంలో తెలంగాణలోనే వరంగల్ కమిషనరేట్ పోలీసులు ప్రథమ స్థానంలో ఉండాలని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ సమావేశంలో పరిపాలన విభాగం అదనపు డీసీపీ రవి, డిప్యూటీ డైరెక్టర్ ప్రాసిక్యూషన్ ఎం. సత్యనారయణ, సీసీఆర్‌బీ ఏసీపీ డేవిడ్‌రాజు, ఇన్స్పెక్టర్ శ్రీధర్‌రావు, గణేష్, మామునూర్ ఇన్స్పెక్టర్ రవికుమార్, ఇన్ స్పెక్టర్ అశోక్, అడిషినల్ పీపీలు రంజిత్, రాజమల్లారెడ్డి, స్టివేన్ పాల్గొన్నారు.

# 'చామల' గెలుపునకు కలిసికట్టుగా పనిచేయాలి

**మన చౌరాస్తా, జనగామ :** ప్రస్తుతం జరుగుతున్న ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపు కోసం అందరూ కలిసికట్టుగా పని చేయాలని జనగామ డీసీసీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన తన కార్యాలయంలో మైనార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో పీసీసీ సభ్యులు చెంచారపు శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు జాఫర్ షరీఫ్, ఉపాధ్యక్షులు అయూబ్, టౌన్ అధ్యక్షులు అజారుద్దీన్, మతపెద్దలు అబ్దుల్ అఫిజ్,మున్ని బేగం ఇతర మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

## చామల గెలుపు ఖాయం

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపు ఖాయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నూకల బాల్ రెడ్డి దీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ దోపిడీ విధానాలకు పరాకాష్టగా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఉందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ప్రజలు నమ్మడం లేదన్నారు. ప్రజాస్వామిక విధానాలను అమలు చేసే కాంగ్రెస్ ను ప్రజలు గెలిపించి స్థిరమైన పరిపాలనకు మద్దతుగా నిలవాలని కోరారు.

# కోతుల బీభత్సం

**జనగామ, మన చౌరాస్తా:** జనగామ జిల్లా కేంద్రంలో కోతుల స్వైర విహారంతో పట్టణ ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పట్టణంలోని 2వ వార్డు మిషన్ కాంపౌండ్ ఏరియాలో శనివారం కోతులు బీభత్సం సృష్టించాయి. కాలనీకి చెందిన మధంపెట్టి ఉపేందర్ అనే యువకుడిపై కోతులు దాడి చేశాయి. ఈ ఘటనలో ఉపేందర్ ఒంటిపై గాయాలు కావడంతో జనగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. కోతుల బెడదతో అనేక ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు కౌన్సిలర్ దృష్టికి తీసుకెళ్లగా కౌన్సిలర్ నిర్లక్ష్యపు సమాధానం చెప్తున్నారని బాధితులు ఆరోపించారు. కోతుల బెడద నుంచి తమను రక్షించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

# వైష్ణవి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

**జనగామ, మన చౌరాస్తా:** విద్యార్థుల తల్లిదండ్రులతో ఆటలాడుతున్న జనగామ పట్టణంలోని వైష్ణవి స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్యూఐ జిల్లా అధ్యక్షుడు చిలువేరు అభిగౌడ్ డిమాండ్ చేశారు. జనగామలో టౌన్ అధ్యక్షుడు కార్తీక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. జనగామ లోని వైష్ణవి హై స్కూల్ 2018లో ఎటువంటి అనుమతులు లేకుండా పాత బిల్డింగ్ నుంచి కొత్త బిల్డింగ్ మార్చి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బిల్డింగ్ షిఫ్టింగ్ పర్మిషన్ తీసుకుందన్నారు. ఫైర్ సేఫ్టీ లేకుండా శ్రీచైతన్య అనే కార్పొరేట్ విద్యాసంస్థ పేరుతో అప్పటి నుంచి ప్రజలను మోసం చేస్తూ ఉన్నారన్నారు. కానీ అప్పటికి ఆ పాఠశాలకి వైష్ణవి హైస్కూల్ మీద పర్మిషన్ ఉందన్నారు. ఎన్ఎస్యూఐ తరఫున రెండేళ్లు పోరాడి వారు చేసిన తప్పులని అధికారులకి సాక్ష్యంగా ఇచ్చినా కూడా కొంతకాలంగా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో దేవసేనను కలిసి జరిగిన విషయం తెలుపగా వారు యాక్షన్ కాల్ ఇవ్వగా ఇక్కడ అధికారులు ఆర్జేడీ ఆదేశాల మేరకు వైష్ణవి పాఠశాలని మే 2023న ఆ పాఠశాలనీ సీజ్ చేయడం జరిగిందన్నారు. దాంతో పాటు ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ నీ ఫోర్జరీ చేసి అందరినీ మోసం చేసే ప్రయత్నం చేస్తే అవికూడా తప్పు అని నిర్ధారణ అవగా జనగామ పోలిస్ స్టేషన్లో ఎఫ్ఐఆర్ కూడా అవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో లింగాలఘన్పూర్ మండల అధ్యక్షుడు ధీరజ్ గౌడ్, టౌన్ కమిటీ మెంబర్లు మల్లికార్జున్, అభిషేక్, జనగామ మండల ఉపాధ్యక్షులు ప్రేమ్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

**స్టేషన్‌ఘన్‌పూర్ , మన చౌరాస్తా :** జనగామ జిల్లా చిల్పూర్ మండలం నష్కల్ గ్రామానికి చెందిన సుమారు 100 మంది బీఆర్ఎస్ నాయకులు, మహిళలు, యువకులు హన్మకొండలోని ఎమ్మెల్యే గారి నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల అమలుకు నిదర్శనమే ఈ చేరికలు అని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమ పాలనను అందిస్తున్న కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రతీ కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని తనని నమ్మి వచ్చే ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. మే 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

Local News

# ఘనంగా స్వామివారి వార కళ్యాణం

**స్టేషన్‌ఘన్‌పూర్ , మన చౌరాస్తా:** జనగామ జిల్లా చిల్పూర్ మండల కేంద్రంలోని శ్రీ బుగులు వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి వార కళ్యాణము అర్చకులు వేదమంత్రోచరణలతో వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకకు వివిధ గ్రామాల, పట్టణాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో లక్ష్మీ ప్రసన్న, అర్చకులు బి.రవీందర్ శర్మ, సౌమిత్రిశ్రీరంగాచార్యులు కృష్ణమాచార్యులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ కు చెందిన నాళం నాగార్జున రాగమణీ, సుజాతలు ఒక లక్ష ఒక్కరూపాయలు విరాళం ఇచ్చారు. అనంతరం ధర్మసాగర్ కు చెందిన తిరునగరి హరీష్ కీర్తిలు అన్నదానం చేశారు.

## రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

**స్టేషన్‌ఘన్‌పూర్ , మన చౌరాస్తా :** జనగామ జిల్లా చిల్పూర్ మండలం చిన్న పెండ్యాల ఎల్లమ్మ గుడి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే...చిన్న పెండ్యాల నుండి హనుమకొండ వైపు వెళుతున్న టీవీఎస్ ఎక్సెల్ ను హైదరాబాదు నుండి హనుమకొండ వైపు వెళుతున్న కారు వెనక నుండి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ముల్కనూర్ మండలం కొప్పూరు గ్రామ శివారు జిందారిపల్లికి చెందిన గంట సారమ్మ, గంట రాజయ్య, గంట అనిల్, గంట సందీప్ అనే ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 స్టేషన్ ఘన్ పూర్ అంబులెన్స్ ద్వారా ఈఎంటి హరికృష్ణ, పైలెట్ శ్రీనివాస్ ఎంజీఎం హాస్పిటల్ లో చేర్పించారు. ఇందులో గంట సారమ్మ పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

## పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

**హనుమకొండ, మన చౌరాస్తా :** పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. ఆర్డీవో కార్యాలయం పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కోసం ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌ను శనివారం పరిశీలించారు. ఈ ఫెసిలిటేషన్ సెంటర్ లోని ఆరు కేంద్రాలను పరిశీలించి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ గురించి ఎన్నికల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఇబ్బందులు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకుల విస్తృత ప్రచారం

**జనగామ, మన చౌరాస్తా:**

భువనగిరి పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్కుమార్ రెడ్డి గెలుపు కోరుతూ జనగామ పట్టణంలో కొమ్మూరి ప్రతాప్ రెడ్డి తనయుడు కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ నుంచి బస్టాండ్ వరకు, పలు వార్డుల్లో జనగామ పట్టణ కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, జిల్లా కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎలక్షన్ డ్యూటీలో అప్రమత్తంగా ఉండాలి

- ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి
- చెక్ పోస్టుల వద్ద నిఘా పెంచాలి
- సీ విజిల్ యాప్ ద్వారా ఎన్నికల ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించాలి
- ఎన్నికల వ్యయ పరిశీలకుడు సయాన్ దేబర్మ

జనగామ, మన చౌరాస్తా : అధికారులు ఎన్నికల విధుల్లో జవాబుదారీతనం పనిచేయాలని, ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకుడు సయాన్ దేబర్మ అన్నారు. శనివారం జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఉప ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్, డీసీపీ సీతారాంలతో కలిసి లోక్ సభ ఎన్నికల విధుల నిర్వహణ, పనితీరుపై ఎన్నికల నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల వ్యయ పరిశీలకుడు మాట్లాడుతూ.. రోజువారీగా నివేదికలను నిర్దేశించిన సమయంలోనే అందజేయాలన్నారు. మద్యం, డబ్బు పంపిణీ వంటి వాటిని నియంత్రించేందుకు చెక్ పోస్ట్‌ల వద్ద నిఘా పెంచాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్ , వీడియో సర్వేలెన్స్ టీంలు పకడ్బందీగా పనిచేయాలని సూచించారు. సీవిజిల్ యాప్ వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అదే విధంగా సీవిజిల్ యాప్ ద్వారా వచ్చే ఎన్నికల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా చెక్ చేయాలని, లైసెన్స్ లేని బెల్ట్ షాపులను గుర్తించి సీజ్ చేయాలన్నారు. ఎన్నికల ప్రచార సమావేశాలను పూర్తిస్థాయిలో వీడియో కవరేజీ చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలోని సమీకృత కంట్రోల్ రూంను పరిశీలించారు. సమావేశంలో పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి, జెడ్పీ సీఈఓ అనిల్ కుమార్, ఎలెక్టోరల్ రోల్ నోడల్ అధికారి, డీఆర్డీఓ మొగులప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

**జనగామ, మన చౌరాస్తా :** ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా స్వీప్ నోడల్ అధికారి వినోద్ కుమార్ సూచించారు. శనివారం భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని జనగామ అసెంబ్లీ సెగ్మెంట్ కు సంబంధించి స్వీప్ కార్యక్రమంలో భాగంగా భారత ఎన్నికల సంఘం దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్లకు కల్పిస్తున్న సదుపాయాలపై వగాహన కల్పించారు. ఈ సందర్భంగా వినోద్కుమార్ మాట్లాడుతూ.. వయోవృద్ధులు, వికలాంగుల కోసం పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపుల ఏర్పాటు, ప్రత్యేక క్యూ పద్ధతి, వారిని ఇంటి నుంచి పోలింగ్ కేంద్రానికి తీసుకువచ్చేందుకు ఆటో సదుపాయం, పోలింగ్ కేంద్రానికి వచ్చిన తర్వాత నడవలేని వారి కొరకు వీల్ చైర్ సదుపాయం, తదితర అన్ని సౌకర్యాలను కల్పించినట్లు వివరించారు. అదే విధంగా సైన్ లాంగ్వేజ్ ఇన్స్ట్రక్టర్ వినోద్ చేత అంగన్వాడీ టీచర్లకు సైన్ లాంగ్వేజ్ పై శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీడబ్ల్యూడీ, వయోవృద్ధుల నోడల్ అధికారి సరిత, డీడబ్ల్యూఓ జయంతి, సీడీపీఓలు, వయోవృద్ధుల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, వికలాంగుల అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# WANTED విలేకరులు కావలెను

www.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

'మన చౌరాస్తా' తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తి స్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'మన చౌరాస్తా' సాదర స్వాగతం పలుకుతోంది.

## సెల్ : 9676400812


# కాంగ్రెస్‌తో భారీగా చేరికలు

**పాలకుర్తి, మన చౌరాస్తా :** మండలంలోని వివిధ గ్రామల నుంచి బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎంపీటీసీలు, తాజా మాజీ సర్పంచులు, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ ముఖ్యనాయకులు, 1000 మంది ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సి రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే యశస్విని ఝాన్సి రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి రోజు రోజుకు వలసలు పెరుగుతున్నాయని అన్నారు. కారు పార్టీ చేసిన మోసాలకు నియోజకవర్గ ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. కొత్తగా చేరిన వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటామని, కొత్త పాత తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా పని చెయ్యాలని సూచించారు, పార్లమెంట్ ఎన్నికల్లో కావ్య కు అధిక మెజారిటీ అందించాలని కోరారు. కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షులు గిరగాని కుమారస్వామి, సీనియర్ నాయకులు ఎర్రబెల్లి రాఘవరావు, కుమార్, శ్రీనివాస్, కృష్ణ మూర్తి, హరీష్, యూత్, మహిళ నాయకులు పాల్గొన్నారు.

### ప్రచారంలో...

కొడకండ్ల మండలం రేగుల, రేగుల తండా గ్రామంలో ఉపాధిహామీ కూలీలా వద్దకు వెళ్లి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఓటు అభ్యర్థించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కడియం కావ్య చేతి గుర్తుకు అత్యధిక ఓటు వేసి గెలిపించాలని, కోరారు.